ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం 12 మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm

స్థిర, చరాస్తులు రూ. 115 కోట్లు

# విజయశాంతికి సొంతకారు లేదట...



## దాసోజు శ్రవణ్ కు స్థిరాస్తులు ...

ఎమ్మెల్యే కోటా M.L.C ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. కాంగ్రెస్ M.L.C విజయశాంతి...తనకు స్థిర, చరాస్తులు కలిపి 115 కోట్లపైగా ఉన్నాయని పేర్కొన్నారు. తనకు సొంతకారు మాత్రం లేదని తెలిపింది. B.R.S ఎమ్మెల్సీ అభ్యర్థి దాసోజు శ్రవణ్...తనకు ఎలాంటి స్థిరాస్తులు లేవని...అఫిడవిట్ లో పొందుపరిచారు.

# 19న బడ్జెట్

## 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న ప్రవేశపెట్టనుంది. ఈమేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉండనుంది. 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 27 వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నుంచి 26 వరకు పద్దులపై చర్చ ఉండనుంది.





# ప్రజలే కేంద్రంగా పాలన

## ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం

## రైతు భరోసా, రుణమాఫీ, కృష్ణా జలాల అంశం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు

హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో పలుమార్లు ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. వారి నినాదాల మధ్య గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. గవర్నర్ ప్రసంగంలో రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు రూ. 500 బోనస్, కృష్ణా జలాల అంశాలు వచ్చినప్పుడు బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. తెలంగాణలో ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని గవర్నర్ అన్నారు.

రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజల సాకారానికి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతోందని ఆయన పేర్కొన్నారు. రుణమాఫీ సహా అన్ని హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రైతులు రాష్ట్రానికి ప్రాణం వంటి వారని, రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందని తెలిపారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకితభావానికి నిదర్శనమని అన్నారు.

రూ. 2 లక్షల వరకు రుణమాఫీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. రైతుకు పంట సాయాన్ని రూ. 12 వేలకు పెంచినట్లు చెప్పారు. వరి రైతులకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం గేమ్ ఛేంజర్‌గా ఉందని, ఈ పథకం ద్వారా మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణిస్తున్నారని తెలిపారు. తెలంగాణ పురోగమించడమే కాదని, రూపాంతరం చెందుతోందని గవర్నర్ అన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నామని అన్నారు.

# కన్యత్వం రూ.18 కోట్లు



## బ్రిటన్ యువతి ఆన్ లైన్ లో వేలం దక్కించుకున్న హాలీవుడ్ నటుడు సోషల్ మీడియాలో వైరల్

యూకే : బ్రిటన్‌కి చెందిన ఒక యువతి తన కన్యత్వాన్ని హాలీవుడ్ నటుడికి భారీ మొత్తంలో అమ్మినట్లు వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే...యూకేకు చెందిన 22 ఏళ్ల యువతి తన కన్యత్వాన్ని ఆన్ లైన్లో వేలం వేయగా రూ.18 కోట్లుకు హాలీవుడ్ నటుడు దక్కించుకున్నాడని సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. అయితే ఈ వేలం అనంతరం సదరు యువతి మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నాకు ఎలాంటి దిగులు కానీ పశ్చాత్తాపం కానీ లేదు. చాలా మంది అమ్మాయిలు తమ కన్యత్వాన్ని ఎలాంటి విలువైన ప్రతిఫలం లేకుండా కోల్పోతారన్నారు. ఈ వేలం ద్వారా వచ్చిన డబ్బుతో నా ఫ్యూచర్‌ని సురక్షితం చేసుకున్నానన్నారు. అలాగే ఈ డబ్బును తన కెరీర్ కోసం ఉపయోగిస్తానని తెలిపారు. అయితే ఈ విషయంపై తన తల్లిదండ్రులు తనకు మద్దతు తెలిపారని తెలిపింది. తాను షుగర్ వుమెన్‌గా మారి నెలకు రూ.3 కోట్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఆస్తులు సీజ్

## 124 బ్యాంకు ఖాతాల స్తంభన



ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయాలని ఢాకా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ చర్యలో భాగంగా 124 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని కోర్టు ఆదేశంలో ఉంది. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న మాజీ పీఎం షేక్ హసీనా, గత ఏడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింసాత్మక అశాంతి నేపథ్యంలో పదవికి రాజీనామా చేశారు. నిరసనలు విస్తృత హింసకు దారి తీశాయి. దీనితో ఇండియాలో తలదాచుకున్నారు. అప్పటి నుండి, బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆమెను తిరిగి తీసుకురావడానికి అనేక ప్రయత్నాలు చేసింది. వాటిలో ఆమె పాస్‌పోర్ట్‌ను రద్దు చేయడం, ఆమెను అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని అధికారికంగా అభ్యర్థించడం వంటివి ఉన్నాయి. అయితే, ఈ అభ్యర్థనలకు భారతదేశం సానుకూలంగా స్పందించలేదు. తాజా కోర్టు తీర్పు హసీనాపై చట్టపరమైన చర్యను సూచిస్తుంది.



# గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలే

## మాజీ మంత్రి కేటీఆర్


హైదరాబాద్: గాంధీభవన్ లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్ మీట్ లా గవర్నర్ ప్రసంగం ఉందని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. గవర్నర్ నోటి వెంట ప్రభుత్వం అబద్ధాలు చెప్పించిందని కేటీఆర్ ఆరోపించారు. గవర్నర్ స్థాయిని దిగజార్చి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని చాటుకుందని కేటీఆర్ అన్నారు. రైతులకు ఊరటనిచ్చే ప్రకటన ఉంటుందని ఆశించామని తెలిపారు. లక్షల ఎకరాల్లో పంట ఎండుతుంటే కనీసం పట్టించుకునే మంత్రి లేరు.. ఎండుతున్న ప్రతి ఎకరానికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యతన్నారు. 20 శాతం కమీషన్ అడుగుతున్నారని కాంట్రాక్టర్లు ధర్నా చేస్తున్నారన్నారు.. డిప్యూటీ సీఎం ఆఫీసు ముందే ధర్నా చేసే పరిస్థితి దేశంలో ఎక్కడా లేదని మండిపడ్డారు.

# కేసీఆర్‌తో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భేటీ

## రాజకీయ వర్గాల్లో దుమారం

## గతేడాది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయింపు

హైదరాబాద్: పటాన్‌చెరు నుంచి పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రశేఖర్ రావును కలిశారు. ఇది రాజకీయ పునర్వ్యవస్థీకరణల గురించి ఊహాగానాలకు దారితీసింది. గత సంవత్సరం కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మహిపాల్ రెడ్డి, రాష్ట్ర అసెంబ్లీలోని తన చాంబర్‌లో చంద్రశేఖర్ రావు ను కుటుంబ వివాహానికి ఆహ్వానించడానికి కలిశారు. కేసీఆర్ హృదయపూర్వకంగా స్పందించి ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నప్పటికీ, అధికార కాంగ్రెస్‌పై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి మధ్య మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి తిరిగి రావాలని యోచిస్తున్నారనే చర్చకు ఈ సమావేశం ఆజ్యం పోసింది.





# ఎస్ఎస్ఎంబీ29 మా పర్యాటకానికి తోడ్పాటు

## ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిదా



భువనేశ్వర్ : రాజమౌళి, మహేష్ బాబు సినిమాపై ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా స్పందించారు. వీరి కాంబోలో సిద్ధమవుతున్న ఈ సినిమా షూటింగ్ ఒడిశాలో జరగడం రాష్ట్రానికి గర్వకారణమని, ఇది స్థానిక పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు రాష్ట్రాన్ని సినిమా షూటింగ్‌లకు ఆకర్షణీయ కేంద్రంగా మార్చుతుందని సూచించారు. ఎస్ఎస్ రాజమౌళి , సూపర్ స్టార్ మహేశ్ బాబు ఎస్ఎస్ఎంబీ29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ – రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఈ సినిమాలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం.